# అందుకోండి అదృష్టం

మాదిరాజు లక్ష్మీనరసింహారావు

పట్టభద్రుడై మూడు సంవత్సరాలైనా ఉద్యోగం దొరక్క తీరిగ్గా బజార్లంబడి తిరిగే రంగారావు రోజూ మాదిరిగానే ప్రభుత్వ గ్రంథాలయం చేరాడు. తీరిగ్గా ఫాను కింద కుర్చీలో కూర్చుని మడత నలిగిన ఇస్త్రీప్యాంటును సరిచేసుకొని తాపీగా దినపత్రిక చేతిలోకి తీసికొని అలవాటు ప్రకారం వాంటెడ్ కాలమ్స్ వెదక సాగాడు. పేపరంతా తిరగేస్తున్న రంగారావు ఒక ప్రకటనచూసి ఒక్కసారిగా ఆనందంతో పైకెగిరి తరువాత అది లైబ్రరీ అని గుర్తు తెచ్చుకొని పర్టుకాలరు ఒకసారి సవరించుకొని జాగ్రత్తగా ఆ ప్రకటన చదవసాగాడు.

'అందుకోండి అదృష్టం'

'సంపన్న కుటుంబమునకు చెందిన అందమైన యువతిని వివాహమాడుటకు పాతిక సంవత్సరముల వయస్సు కలిగిన పట్టభద్రుడైన యువకుడు కావలయును. అప్లికేషన్ ఫారమ్ కొఱకు ఒక రూపాయి యం. ఓ. చేయండి' అని ఉంది.

వెంటనే రంగారావు గబగబా పోస్టాఫీసుకు పరుగెత్తికెళ్ళి ఆ రోజే క్రొత్తగా విడుదలయిన హిందీ సినిమాకు వెడదామని ఉంచుకున్న రూపాయిని, తనకు అదృష్టయోగం పట్టవచ్చునని, యం. ఓ. చేశాడు.

సాయింత్రం యీ సంగతి తన మిత్రబృందంలకు చెబుదామనుకున్నాడు, కాని ఒకవేళ వారుకూడా అప్లైచేస్తే తనఛాన్సు పోవచ్చుననే సదుద్దేశ్యంతో ఆ సంగతి యెవరికీ చెప్పలేదు. ఆ మర్నాటినుండి రంగారావు అప్లికేషన్ వచ్చిందేమోనని పోస్టాఫీసు చుట్టూ తిరుగసాగాడు రంగారావు తిరుగుడు చూసి ఆ పోస్టుమాన్ విసుక్కున్నాడు ఆ విసుగుకు కారణం తెలిసిన రంగారావు ఆ పోస్టుమాన్‌కి దసరా మామూలు సమర్పించాడు అప్పటి నుంచి రంగారావుకు ఆ పోస్టుమాన్ 'లేవని' నమ్రతతో జవాబు చెప్పసాగాడు. అప్లికేషన్ ఫారమ్ రాకపోయేసరికి రంగారావుకు నిరాశ కలిగింది, ఒకవేళ ఆ యం. ఓ. చేరిందో లేదో అని అనుమానంకూడా కలిగింది. ఏమయితేనేమి ఒక శుభముహూర్తాన ఒక పెద్ద బరువైన కవరు రంగారావు అడ్రసుమీద వచ్చింది.

సంతోషంతో ఉప్పొంగిపోయాడు రంగారావు ఆ కవరుచూసి. ఇంటికివెళ్ళి ఆ అప్లికేషన్ ఫారమ్ మూడుసార్లు తిరగేసి ఆవులించాడు. ఆ అప్లికేషన్ ఫారమ్ నెంబరు 2362 అని చూసేసరికి రంగారావు గుండె ఆగిపోయింది. అయినా తను అందమయినవాడిని, తనకు జనరల్ నాలెడ్జీ ఉందని నమ్మకం గలిగిన రంగారావు జాగ్రత్తగా చివరవరకు వ్రాసినది చదవసాగాడు.

అప్లికేషన్ ఫారమ్‌తో ఈ క్రిందివి జతపరుచవలెను—

1) మూడు పోజులలో అభ్యర్థి పాస్‌పోర్టు సైజు ఫోటోలు

2, ఎస్. ఎస్. ఎల్. సి; సర్టిఫికెట్ ననుసరించి అభ్యర్థి సరియైన వయసునునిరూపించు సర్టిఫికెట్టు

3) ఇంటర్వ్యూకి పిలుచుటకై అభ్యర్థి చిరునామా కలిగిన 25, నయాపైసల స్టాంపు అంటించిన కవరు.

4) చివరిసారిగా అభ్యర్థి హాజరైన కళాశాల ప్రిన్సిపాల్ వద్దనుండి కాండక్టు సర్టిఫికెట్టు.

5) బి. ఏ. పాస్ సర్టిఫికెట్టు.

6) ఒక గజెటెడ్ ఆఫీసరునుండి మరొక కాండక్టు సర్టిఫికెట్టు.

7) అభ్యర్థి ఆరోగ్యవంతుడుగా ఉన్నట్లు ఒక మెడికల్ సర్టిఫికెట్

8) నేటివిటీ సర్టిఫికెట్టు

9) రిజిస్ట్రేషన్ ఫీజుకుగాను పదిరూపాయలు యం. ఓ. చేసి ఆ రసీదు అప్లికేషన్ ఫారమ్‌కు జతపరచవలెను.

10) అభ్యర్థి యేమైన యితర విషయములు చెప్పకోనదలచిన తెలుపుకొనవచ్చును.

రంగారావు తిథి వారం బాగానే ఉన్నదని నమ్మినమీదట విఘ్నేశ్వరుణ్ణి తలుచుకొని, వెంకటేశ్వర స్వామికి ముడుపు చెల్లించుకుంటానని మొక్కుకొని అప్లికేషన్ ఫారమ్ పూర్తి చేసి దానికి కావలసిన ఫోటోలు యితర సామాగ్రి అంతా సిద్ధంచేసి, రిజిస్ట్రేషన్ ఫీజు క్రింద పదిరూపాయలు కూడా యం. ఓ. చేసి ఆ కవరును రిజిస్టరు పోస్టులో సాగనంపాడు.

ఆ మరుసటి రోజునుంచి ఆంజనేయుల స్వామి గుడికివెళ్ళి ప్రదక్షిణాలు మొదలుపెట్టాడు ఇంటర్వ్యూ అకస్మాత్తుగా వస్తుందేమోనని స్నేహితుల్ని బతిమాలి రెండు టెర్లిన్ సూట్లు సంపాదించాడు. తాను యెప్పుడో బి. సి లో కొన్న బూట్లకు అర్జెంటిచ్చి అద్దంలా పాలిష్ పెట్టించాడు. అతిగా వాగుతుండే రంగారావు యిప్పుడు మితంగా మాట్లాడసాగాడు. సున్నిపిండితో మొహం రుద్దుకోవడం మానేసి టాయిలెట్ సోప్స్, స్నోలు పౌడర్లు వాడసాగాడు.

రంగారావులో వచ్చిన యీ ఆకస్మిక మార్పుకు రంగారావు స్నేహబృందంలో పెద్ద కలవరాన్ని తెచ్చింది, కొందరు వాడికేదో గాలి పూనిందన్నారు, మరికొందరు పిచ్చి క్కింది విశాఖపట్టణం పిచ్చాసుపత్రికి పంపాలన్నారు. మరికొందరు యింకోవిధంగా అన్నారు. తన్ను యేవిధంగా ఎవరు అన్నా అవి తనను కాదన్నట్టు మౌనంగా కూర్చున్నాడు రంగారావు.

(తరువాయి 28 వ పేజి)

# ★ అందుకోండి అదృష్టం ★

(8 వ పేజి తరువాయి)

ఒకరోజున అకస్మాత్తుగా రంగారావు ఎదురుచూస్తున్న ఇంటర్వ్యూ కవరు వచ్చింది. ఇంటర్వ్యూ అక్టోబరు పదో తారీఖున హైద్రాబాద్ చిక్కడపల్లిలో. రంగారావు తాను యెప్పుడో టెంపరరీ ఉద్యోగం చేస్తూ బ్యాంకిలో దాచిన రెండువందల రూపాయలు డ్రా చేశాడు. త్వరలో తనకు దక్కబోయే ఆస్తి, భార్యల గురించి కలలుకంటూ గడపసాగాడు. థర్డుక్లాసులో ప్రయాణం యిష్టంలేక విజయవాడనుంచి హైద్రాబాద్‌కు సెకండ్ క్లాస్ టికెట్టు తీసికొన్నాడు.

తొమ్మిదో తారీఖు రాత్రి రైల్లో విజయవాడనుంచి బయలుదేరాడు. అది రైల్వేటైమ్ ప్రకారం యనిమిది గంటలకు బయలుదేరి తెల్లవారి ఆరుగంటలకు చేరవలసిఉంటే రెండు గంటలు లేటుగా బయలుదేరింది. హాయిగా ఆరుగంటలకు చేరతాగదా అనుకున్న రంగారావుకు, రైలు రెండుగంటలు లేటుగా బయలుదేరేసరికి కొద్దిగా అనుమానం కలిగింది. మధ్యలో కజిపేటదగ్గర రైలు ఇంజన్ చెడి మరో గంట లేటయింది. యలాగయితేనేం ఏ పదిగంటలకే ఇంటర్వ్యూ.

గబగబా రంగారావు ఆదరా బాదరా వాడావిడ పడుతూ స్టేషన్ బయట పడ్డాడు.

గబగబా అక్కడవున్న ఒక హోటల్లో కాఫీ త్రాగుదామనుకున్నాడు. కాని ఆలస్యమవుతుందని కాఫీకూడా త్రాగకుండా ఒక టాక్సీ ఎక్కి అడ్రస్ యిచ్చి దాంట్లో యెక్కాడు.

పదిగంటల ముప్పై నిమిషాలకల్లా టాక్సీ చిక్కడపల్లిలోకి ఒక పెద్ద నీలిరంగు రెండంస్తుల మేడముందు ఆగింది. రంగారావు టాక్సీకి డబ్బులిచ్చి హుందాగా లోపలికి నడిచాడు. మెట్లెక్కుతుండగా లోపలినుంచి యేదో పెద్ద గందరగోళం వినిపించసాగింది. లోపల భయపడుతూనే రంగారావు మెట్లెక్కి లోపలి దృశ్యాన్ని చూసేసరికి రంగారావు గుండె కాసేపు కొట్టుకోవటం మానేసింది.

క్రొత్తసినిమా విడుదలయిన రోజు బుకింగ్ ముందు జనం కొట్టుకునే దృశ్యం రంగారావు కళ్లముందు మెదిలింది. ఒకవేళ తాను పొరపాటు అడ్రస్‌కు వచ్చానేమోనని అడ్రస్ చూసుకున్నాడు. సరిగానే ఉన్నది. అక్కడ కుమ్ముకుంటున్న జనమంతా ఇంటర్వ్యూకు వచ్చారని తెలిసేసరికి రంగారావు గుండె దడదడలాడ సాగింది.

'ఈ అదృష్టం యెవరిని వరిస్తుందో ఆమెకు పదిలక్షల రూపాయల ఆస్తి ఉందిట' అని ఒకడు తన ప్రక్కవాడితో అంటున్నాడు.

రంగారావుకు 'పదిలక్షల రూపాయలు' అనే మాట వినేసరికి తన సొంతడబ్బేదో పోతున్నట్లు ఫీలయ్యాడు. అక్కడ గుమ్మందగ్గర నుంచున్న ఒకలావుపాటి బుర్ర మీసాలవాడి మీద పడింది. రంగారావు దృష్టి. వాడిని చూడంగానే రంగారావు మెదడులో యేదో ఆలోచన తళుక్కున మెరిసింది. నెమ్మదిగా సైగ చేసి పిలిచాడు. వాడు దగ్గరకువచ్చి "యేమిటి బాబు పిలిచారు" అని అన్నాడు. అతి వినయంగా.

రంగారావు వాడ్ని ప్రక్కకు పిలిచి యెవరూ చూడటంలేదని నిర్ధారణ చేసుకొని వాడి చేతిలో ఒక పదిరూపాయల కాగితం పెట్టి కొద్దిగా వివరాలు చెప్పు బాబు అని బ్రతిమాలాడు.

ఆ లావుపాటి బుర్రమీసాలవాడు నెమ్మదిగా నవ్వుతూ ఆ కాగితం తీసికొని జేబులో పెట్టుకొని "యేం లేదు బాబు మీరు వెళ్లంగానే మనదేశ ప్రధాని యెవరూ అనో, రాష్ట్ర ముఖ్యమంత్రి యెవరూ ? అనో ప్రశ్నిస్తారు. అంతే సార్ !" అని నెమ్మదిగా జారుకోసాగాడు.

'అది సరేకాని యీ జనప్రవాహంనుండి తప్పించుకొని ముందు నిలబడేట్టు చూడు' అన్నాడు రంగారావు.

మళ్లీ ఆ బుర్ర మీసాలవాడు రంగారావు వంక అదోరకంగా చూశాడు.

వాడి భావన అర్థంచేసికొని మనసులో వాడిని తిట్టుతూనే యింకో ఐదురూపాయలు వాడిమొహాన పడేశాడు.

వాడు 'నాతో రండి సార్ !' అంటూ ఆ యింటి దొడ్డివైపు నడిచాడు.

రంగారావు అనుమానంతో 'యిదేమిటయ్యా 'యీ' దొడ్డిదారికి తీసుకొచ్చావ్' అన్నాడు.

'దొడ్డిదారే బహు దొడ్డదారి అన్నారు మన పెద్దలు' అని ఒకసామెత చెప్పి దొడ్డిద్వారంగుండా ఆక్యూ మొదట్లో నిలబెట్టాడు రంగారావుని.

చివరనున్న క్యూలోనిజనంలో రంగారావు ఆగమనం కొద్దిగా సంచలనం కలిగించింది.

యింతలో సెలక్షన్ బోర్డుమెంబర్లు వస్తున్నారన్న అనగానే అందరూ నిశ్శబ్దంగా నుంచున్నారు. యింతలో ఆ భవనం గేటుముందు రెండు చెవ్రోలెట్ కార్లు ఆగాయి. ముందు కార్లోంచి నలుగురు పురుషులు వెనుక కార్లోంచి ఒక యువతి దిగారు. ఆ యువతి అందమైన సీతాకోకచిలుకలాగా ఉంది.

ఆమెను చూసి అందరూ యే దేవకన్యో అని కన్నార్పకుండా చూడసాగారు. ఆమె పెళ్లికే యీ ఇంటర్వ్యూ అని తెలిసి అందరూ 'ఆమే నా కాబోయే భార్య' అని యెవరి మనసులో వారు అనుకున్నారు.

'రేపు నా భార్య నేను ఈ కార్లోనే హనీమూన్‌కు వెళ్లేది' అని యింకో రంగుటద్దాల కళ్లజోడు అబ్బాయి గాలిలో మేడకట్టసాగాడు.

ఆ వచ్చిన నలుగురు పురుషులు, ఆ యువతి లోపలి గదిలోకి వెళ్లారు. వాళ్లు లోపలికి వెళ్లగనే అందరూ నిశ్శబ్దంగా, ఆతురతగా

నవ్వే మొహంతో ఇంటర్వ్యూకు యెప్పుడు పిలుస్తారో అని నుంచున్నారు. కొందరు చెదిరిన క్రాపులను సరిచేసుకుంటున్నారు.

యెంతసేపటికి లోపలనుంచి పిలుపు రాలేదు.

'యింకా యెప్పుడు పిలుస్తారు ఇంటర్వ్యూకి పన్నెండు గంటలకన్నారు పన్నెండు గంట అయింది' అన్నాడు అంతకుముందు రెండు నెలలు టైఫాయిడ్ వలన మంచంమీదనుండి లేచి నించోటానికి ఓపికలేని ఒక యువకుడు.

'మన ఓపికను పరీక్షించటానికే వాళ్లు ఇలా యిలా 'చోద్యం పెడుతున్నట్టుంది' అన్నాడు పక్కనే నున్నవాడు.

యింతలో లావుపాటి బుర్రమీసాల వాడికి లోపలనుంచి 'కాల్' వచ్చింది.

వాడు లోపలికెళ్ళి రెండు నిమిషాల తర్వాత తిరిగి వచ్చాడు 'ఒక్కొక్కరిని లోపలకు పంపుతారు కదలకుండా నుంచోండి' అన్నాడు బుర్రమీసాలవాడు.

అప్పటిదాకా కదలకుండా నుంచున్న జనం అంతా సినిమాహాలు దగ్గర బుకింగ్ తెరవంగానే తోసుకుంటారు చూడండి ఆ విధంగా తోసుకోసాగారు ముందు నుంచున్న రంగారావు మీద పడసాగారు వెనుక ఉన్న వాళ్లందరూ. పొద్దుటినుంచి కాఫీ నీళ్ళయినా తాగని రంగారావు ఆ తోపుడికి నిలువలేక బయటకు వచ్చాడు. బయటకువచ్చిన రంగారావు తన దురదృష్టానికి చింతిస్తూ చేసేదిలేక క్యూ చివరకు వెళ్లినుంచున్నాడు. ఆక్యూ కొండవీటి చాంతాడు పొడుగుంది.

ఒక్కొక్కరు లోపలకు వెళుతున్నారు బయటకు తిరిగి వస్తున్నారు ఒకటి...రెండు.. గంటలు గడవసాగాయి. మధ్యాహ్నం మూడుగంట లయింది. ప్రొద్దున్నుంచి రంగారావు మంచినీళ్ళయినా పుచ్చుకోని కారణం చేత మొఖమంతా వాడిపోయి తోటకూర కాడలాగా అయింది. ఆ వెర్రెండవలన తల తిరుగ సాగింది

రంగారావు ఎందు యింకా పదిమంది ఉన్నారు.

... .... ...

... ... ...

రంగారావు వంతు వచ్చింది

రంగారావు లోపలికి వెళ్లాడు. అది ఏయిర్ కండిషన్డ్‌రూమ్ రంగారావు ఆ రూమ్‌లో కెళ్లేసరికి పోతున్న ప్రాణం లేచి వచ్చినట్లయింది.

వాళ్లుచూపించిన స్పాంజ్ సోఫాలోకూల బడ్డాడు.

'టిఫిన్ తీసుకుంటారా ?' అన్నాడు ఆ సెలక్షన్‌బోర్డ్ మెంబరు ఒకడు రంగారావు వాలకం చూసి.

. సుష్టుగా టిఫిన్ చేశాడు

'మేము హాస్పిటల్‌నుంచి వచ్చినవాళ్ల గురించి ఇంటర్వ్యూ చేశాము యింతమందిలో మేము యెవరిని సెలక్టు చెయ్యాలో తెలియటం లేదు. అందుకని ఒక స్కీము పెట్టాము యిది ఒక లాటరీ. యిందులో టిక్కెట్టు పాతిక రూపాయలు. అన్ని టిక్కెట్లు కలిపి లాటరీవేస్తాము. అందులో వచ్చిన నెంబరు సెలక్టెడ్ అన్న మాట. అని ముగించాడు ఆ మెంబరు రంగారావు వెళ్ళిపోతూనువైపు చూశాడు రంగారావును చూసి ఒక చిరునవ్వు విసిరింది. ఆ నవ్వుకు రంగారావు ఐస్ అయ్యాడు. జేబులోంచి పాతిక రూపాయలు తీసిచ్చాడు. రసీదు తీసికొని బజార్న పడ్డాడు.

లాటరీ రేపు సాయింత్రం ఐదు గంటలకు. ఆరోజు రాత్రి రైల్వే స్టేషన్‌లో గడిపాడు కలత నిద్రలో తెల్లవారింది.

రంగారావు తనకు సాయింత్రం కలుగబోయే అదృష్టాన్ని గురించి ఆలోచిస్తూ కాలకృత్యాలు తీర్చుకున్నాడు. కాఫీగతపాలైతి గనుక హోటల్‌కి చేరాడు. బయట ఎవరో కుర్రవాడు దినపత్రిక లమ్ముతున్నాడు. ఒక పేపరు తీసికొని హోటల్లో కూర్చుని టిఫిన్‌కు ఆర్డరిచ్చాడు.

రంగారావు మనసంతా ఆరోజు జరుగబోయే డ్రా మీదే ఉంది పరధ్యానంగా పేపరు చదువుతున్న రంగారావు దృష్టి ఒక చోట అకస్మాత్తుగా ఆగిపోయింది.

'ఐదుగురు వ్యక్తుల అరెస్టు —

లక్షరూపాయల స్వాధీనం'

నిన్న రాత్రి పోలీసులు హైదరాబాద్‌లో చిక్కడపల్లిలోని ఒక ఇంటిపై దాడి జరిపి ఒక స్త్రీతో సహా ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. వారివద్ద నుండి లక్ష రూపాయలు స్వాధీనపర్చుకున్నారు. వీరు వరుడు కావాలి అని దొంగ ప్రకటనలు చేసి ప్రజలవద్ద నుండి డబ్బు సంపాదించినట్టుగా చెప్పబడుతోంది.

ఈ వార్త చదివేసరికి రంగారావుకి అది హోటల్ అన్న విషయంకూడా మర్చిపోయి అంతా మోసం! అంతా మోసం! అని అరువసాగాడు.

◆ ◆ ◆

'ఏరేయ్ రంగా! కాలేజీకి టైమ్ ఐందిరా! యింకాలేవకుండా యేమిటి కలవరిస్తున్నావ్!' అన్నాడు రంగారావు కాలేజి మేటు రూమ్ మేటు శంకరం. రంగారావు కళ్లు నలుపుకుంటూ అరే! ఎంతా కలా! అనుకుంటూ పక్కమీదనుంచి లేచాడు.

—

మొదటివాడు :— ఏమండి నేను ఒక పెద్దమనిషికి అప్పిచ్చాననుకోండి అతగాడు నాకివ్వలేదనుకోండి అతగాడి నేమనుకోవాలి ?

రెండవవాడు :— ఏముందండి క్రితం జన్మలో మీరు అతనికి బాకీ అనుకోవాలి లేదా వచ్చే జన్మలో మీరు అతని దగ్గర అప్పుతీసికొని ఎగవేయాలి అంతే.

